క్లుప్తంగా

కల్యాణ మండప నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం



గోసవీడు(గంపలగూడెం): మండలంలోని గోసవీడు శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవాలయం ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి దాత గురువారం రూ. 4లక్షలు విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన స్వర్గీయ కొప్పు సుందర రామయ్య, రాములమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు కొప్పు బాబురావు, రత్నకుమారిలు నగదును గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోగిరెడ్డి కృష్ణారెడ్డి, నేరెళ్ల సూరిబాబు, నేరెళ్ల సతీష్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దాతను సత్కరించారు. బొమ్మారెడ్డి కోటిరెడ్డి, కొత్తా రజనీకాంత్, వజినేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బొర్రగూడెం తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.2.22 లక్షలు

బొర్రగూడెం(మైలవరం): మండలంలోని బొర్రగూడెంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మ గోపయ్య స్వామివార్ల దేవాలయంలో గురువారం ఉదయం హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. మూడు నెలల నాలుగు రోజులకు భక్తులు, గ్రామస్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.2,22,137 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి పి.మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని వెంకట సత్య వరప్రసాద్, ధర్మాదాయ శాఖాధికారులు, భక్తులు, గ్రామస్తుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు చేపట్టామని చెప్పారు.

నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుందని ముస్లిం మత గురువులు తెలిపారు. గురువారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో శుక్రవారం నుంచి రంజాన్ మాసం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి ప్రత్యేక నమాజు చేయనున్నారు. ప్రతి రోజు జరిగే నమాజు కోసం మసీదుల వద్ద ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసినట్లు షాబూఖారీ దర్గా మత గురువు మహ్మద్ ఆల్తాఫ్ రజా చెప్పారు.

శ్మశానవాటికలో ముమ్మరంగా అభివృద్ధి పనులు

మైలవరం: మైలవరం శాంతినగర్‌లో దళితులకు చెందిన శ్మశానవాటికలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం అభివృద్ధి పనులను చేపట్టారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సౌజన్యంతో జేసీబీని ఏర్పాటు చేసి శ్మశానంలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలను తొలగించి, నేలను చదును చేశారు. పంచాయతీ సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి, వార్డు సభ్యుడు ఎం.సంసోను పనులను పర్యవేక్షించారు.

ఉపకార వేతనాలు మంజూరు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మలబార్ గోల్డ్ మెరిట్ స్కాలర్‌షిప్పులు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. 18 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున, 16 మందికి రూ.8 వేల చొప్పున ఉపకార వేతనాలు మంజూరయ్యాయన్నారు. మలబార్ సంస్థ విద్యార్థుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసిందని చెప్పారు.

ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వాలి

చాట్రాయి: గిరిజనులు సాగు చేసుకుంటున్న ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.హరనాథ్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులతో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పొడిగించాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ విశ్వనాథంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, చాట్ల బాబూరావు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని వినతి

పుల్లూరు(మైలవరం): మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వజ్రాల ధనలక్ష్మి, మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను గురువారం నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పుల్లూరు పంచాయతీ పరిధిలో వెయ్యి ఎకరాలకుపైగా మొక్కజొన్న పంట వేశారని, దీనిలో 40 శాతం పైగా పంట నేల మట్టం అయిందన్నారు. అధికారులు స్పందించి పంటలు పరిశీలించి రైతులను సంప్రదించి పంట నష్టం ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, సీపీఎం మండల కార్యదర్శి ఆర్.రమేష్‌బాబు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చంద్రగూడెంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



గొల్లపల్లిలో పోషకాహార లాభాలను వివరిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

చంద్రగూడెం(మైలవరం): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ గౌసియాబేగం తెలిపారు. మండలంలోని చంద్రగూడెం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మార్చి 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. మండలంలోని 56 అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీఓ పుష్పలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని, పిల్లలు పుష్టిగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సీసీ శైలజ, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలత, మైలవరం 3 మహిళా పోలీస్ కె.లలిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషణ్ పక్వాడాలో అందించే పౌష్టికాహార సామగ్రిని ప్రదర్శించారు.

పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి

తిరువూరు: గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహార ధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ ఝాన్సీ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ఐసీడీఎస్ కార్యకర్తలు, డ్వాక్రా గ్రూపు మహిళలకు చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం కల్పించారు. విటమిన్లు అధికంగా లభించే చిరుధాన్యాలను తీసుకుంటే పుట్టబోయే బిడ్డకు కూడా ఎటువంటి సమస్యలు రావని సత్యవతి తెలిపారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎం గురవయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, చైతన్యభవాని, వెంకట కుమారి పాల్గొన్నారు.

ఘనంగా పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు

నూజివీడు: మండల పరిధి గొల్లపల్లిలోని గొల్లపల్లి–2 అంగన్‌వాడీ కేంద్రంలో పంచాయతీ పరిధిలో పోషణ్ పక్వాడ పక్షోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గ్రామ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల గర్భిణులు, బాలింతలకు ఏసీడీపీఓ నాగేశ్వరి ఆరోగ్యపరమైన అంశాలపై వివరించారు. గర్భిణులకు ఏడో నెలలో సీమంతాలు ఎందుకు చేస్తారో శాస్త్రీయంగా వివరించారు. చిరు ధాన్యాలు ఒకప్పుడు పేదవారికి మాత్రమే ఆహారమని, అది ఇప్పుడు వీఐపీ ఆహారమైందన్నారు. సూపర్‌వైజర్ సులోచన రాణి, అంగన్‌వాడీ టీచర్లు జయమణి, శాంతకుమారి, కుసుమ కుమారి,రోజా, దుర్గ, గౌరీశ్వరి, కమలాబాయి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

ముసునూరు: గర్భిణులు అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పోషకాహారంతో బలాన్ని పొంది, రక్తహీనతను తరిమి వేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల సందర్భంగా చెక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పోషకాహారం అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రసవాలన్నీ ప్రభుత్వాస్పత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీపీ టీకే రాణాను కలిసిన ఎమ్మెల్యే రక్షణనిధి



విజయవాడస్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇటీవల తిరువూరులో నిర్వహించిన బహిరంగ సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ కమిషనర్ టీకే రాణాకు తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలోని కమిషనరేట్‌లో సీపీ టీకే రాణాను ఎమ్మెల్యే గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేశారు. పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి పటిష్ట భద్రత చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం



తిరువూరు గ్రంథాలయంలో అమరవీరులకు నివాళి



కొండపల్లిలో మాట్లాడుతున్న మురళీమోహన్

మైలవరం: భరతమాత ముద్దు బిడ్డలు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు చిరస్మరణీయులు అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. వారి 92వ వర్ధంతి సందర్భంగా అమర వీరులను స్మరిస్తూ నివాళులర్పించారు. బ్రిటీష్ వారి సామ్రాజ్యవాద, పెత్తందారీ పాలనను ఎదిరించి, అలుపెరగని పోరాటం చేశారన్నారు. వారి పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

తిరువూరు: బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి పోరాడిన అమరవీరులు సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని తిరువూరు మండలంలో గురువారం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు తిరువూరు శాఖా గ్రంథాలయం, ఎర్రమాడు ఎంపీయూపీ స్కూల్, సుంకర వీరభద్రరావు భవన్‌లలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి పద్మావతి, ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు సుభానీ, ఉదయ్, అశోక్ పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బ్రిటీష్ పాలకుల అరాచకాలను ఎదిరించి అసువులు బాసిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 92వ వర్ధంతి కార్యక్రమం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక క్రాంతి కాన్వెంట్‌లో గురువారం నిర్వహించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్ మాట్లాడుతూ.. వారి పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ వెనిగళ్ల అమ్మాజీ, సర్దార్ సాహెబ్, నాగరాజు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో షిరిడిసాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ సభ్యులు షేక్ హుస్సేన్ సాహెబ్, వూటుకూరు యజ్ఞకృష్ణ, దేవర రామానుజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల ఆరోగ్య భద్రతే ధ్యేయం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు సుమలత, రమ్య సుభాషిణీ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య భద్రతే మా ధ్యేయమని స్థానిక రైల్వే వైద్యశాల డాక్టర్ సుమలత అన్నారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌లో కార్మికులు, ఉద్యోగులకు ఆరోగ్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. డాక్టర్ సుమలతతో పాటు ఆంధ్ర వైద్యశాల పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీంద్ర, జనరల్ ఫిజిషియన్ రమ్య సుభాషిణీ ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ వ్యాధి లక్షణాలు, చర్మవ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధుల నివారణకు మందుల వినియోగం, ఆహార నియమాలు వివరించారు. అనంతరం వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నష్టం లేకుండా పరిహారం చెల్లింపు



జక్కంపూడిలో రైతులతో మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్

విజయవాడరూరల్: గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణలో రైతులకు ఎటువంటి నష్టం లేకుండా పరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ తెలిపారు. విజయవాడ–ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణకు సంబంధించి గురువారం జక్కంపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జేసీ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భూ సేకరణ విభాగ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, విజయవాడ రూరల్ తహసీల్దార్ పి.జాహ్నవి, డిప్యూటీ తహసీల్దార్ ఏ.రాజేష్, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

కలగర(విస్సన్నపేట): మొక్కజొన్న సాగులో రైతులు తగిన సస్యరక్షణ చర్యలు పాటించటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని కలగర గ్రామంలో మొక్కజొన్న సాగును ఏఓ గురువారం పరిశీలించారు. అనంతరం ఆర్బీకేలో రికార్డులు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

మహిళా సమాఖ్య మండల కార్యవర్గం ఎన్నిక



సమాఖ్య సభ్యులతో మండల నాయకులు

ముసునూరు: జాగృతి మహిళా సమాఖ్య మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఏపీఎం డి.రాజశేఖర్ తెలిపారు. మండల వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఉపాధ్యక్షురాలు బి.నయోమి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షురాలిగా దువ్వూరి పద్మావతి(చింతలవల్లి), ఉపాధ్యక్షురాలిగా చీలి జ్యోతి(ముసునూరు), కార్యదర్శిగా నెక్కరగంటి అన్నపూర్ణ(చెక్కపల్లి), సంయుక్త కార్యదర్శిగా నాయుడు రేణుకాదేవి (బలివే), కోశాధికారిగా బర్మా లక్ష్మి(అక్కిరెడ్డిగూడెం)లను ఎన్నుకున్నామన్నారు. నూతన కార్యవర్గాన్ని జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓ జి.రాణి అభినందించారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం

నూజివీడు: వర్తమాన కాలంలోనీ ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ రచించబడేదే ప్రజా సాహిత్యమని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగార్జునసాగర్ ఉద్ఘాటించారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరాది సందర్భంగా నూజివీడు అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి, కళావేదికల ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ జూనియర్ కాలేజీ నందు బుధవారం రాత్రి జరిగిన ఉగాది కవి సమ్మేళనం, సాహిత్య సంస్కృతిక విభావరి నిర్వహించారు. సభకు అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని వెంకట రామారావు అధ్యక్షత వహించారు. కవి సమ్మేళనంలో 17 మంది ప్రముఖ కవులు, రచయితలు తమ అభ్యుదయ గీతాలను ఆలపించారు. కవి సమ్మేళనంలో ప్రముఖ కవులు అత్తిలి వెంకటరమణ, సూరి రామసూరి, శిఖా ఆకాష్, ఈమని శేషయ్య, ఎస్‌కేడీ ప్రసాద్, జడ సుబ్బారావు, కేవీ శేషయ్య, విజయలక్ష్మి, శావా విజయ శ్రీ, దారా మోహన్ రావు, ఎస్‌వీవీ ప్రసాద్, డి.వెంకటరమణ, తదితరులు కవిత గానం చేశారు. అరసం కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షులు దివంగత డాక్టర్ రాచకుళ్ల నరసింహారావు సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి ఈమని శేషయ్యకు కుటుంబ సభ్యులు ప్రసాద్, సుధా చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నూజివీడు పట్టణంలోని విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు జానపద, కూచిపూడి నృత్యాలు, లఘు నాటికలు, ఏకపాత్రాభినయాలు, శ్లోక పఠనం, నృత్య గీతాలను ప్రదర్శించారు.

దెబ్బతిన్న పంటల ఎన్యూమరేషన్ పూర్తి చేయాలి



పుల్లూరులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, అధికారులు

పుల్లూరు(మైలవరం): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వెంటనే ఎన్యూమరేషన్ పూర్తి చేసి, రైతులకు నష్ట పరిహారం అందేలా చూడాలని మైలవరం మార్కెట్ యార్డు చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. మైలవరం మండలం పుల్లూరు గ్రామ పరిధిలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు వెంటనే ఎన్యూమరేషన్ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గోవుకు దశ దినకర్మ నిర్వహణ



ఆగిరిపల్లి: మండలంలోని ఈదరకు చెందిన మొగదాటి జోజిబాబు కుటుంబ సభ్యులు అల్లారుముద్దుగా పెంచుకున్న ఆవు ఆదిలక్ష్మి ఈ నెల 13న ప్రమాదవశాత్తు మృతి చెందింది. ఆవు కళేబరానికి జోజిబాబు కుటుంబ సభ్యులు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో దశ దిన కర్మను వేద పండితుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేసి జోజిబాబు కుటుంబ సభ్యులు తమ ప్రేమను చాటుకున్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రెడ్డిగూడెం/తోటమూల(గంపలగూడెం): రంగాపురం, తోటమూల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం, 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.శ్యామల, పాఠశాల ప్రత్యేక అధికారి ఎం.వెంకటలక్ష్మి గురువారం తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, చదువు మధ్యలో మానివేసిన వారు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాలకు చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పాఠశాలలో 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ల కోసం పరిగణిస్తామని తెలిపారు.

భూగర్భ జలాల పరిరక్షణకు కృషి



పుట్రేలలో మాట్లాడుతున్న దామోదరరెడ్డి

పుట్రేల (విస్సన్నపేట): భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వ్యవసాయ బోర్డు చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి అన్నారు. మండలంలోని పుట్రేల ఆర్బీకే వద్ద అజాదీకా అమృతమహోత్సవ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పరిరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూగర్భ జలాలను సద్వినియోగించుకోవటం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు భీమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జలగణనశాఖ జిల్లా అధికారి నాగరాజు, విశ్వేశ్వరరావు, విజయసారథి, ఏఓ రాజ్యలక్ష్మి, హెచ్ఓ నరేంద్ర పాల్గొన్నారు.

సుంకొల్లులో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి రాంబాబు మాట్లాడుతూ.. సమాజంలోని పరిస్థితులు, పేదల జీవన స్థితిగతులు విద్యార్థులు తెలుసుకునేందుకు ఎన్ఎస్ఎస్ శిబిరాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. వారం రోజుల పాటు తమ గ్రామంలో నిర్వహించే ఈ శిబిరాన్ని సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో 28 మంది విద్యార్థులు గ్రామంలో పలు యోగా కార్యక్రమాలను నిర్వహించడం, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, అధ్యాపకులు జి.పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎస్‌వై నూరానీ గురువారం తెలిపారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం–1 సెంటర్ అంగన్‌వాడీ, ముసునూరు మండలం కాట్రేనిపాడు శివారు రంగన్నపాలెం మినీ సెంటర్‌కు మినీ అంగన్‌వాడీ వర్కర్, ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం –1, వడ్లమాను–1, ముసునూరు మండలం గుళ్లపూడి–3, కాట్రేనిపాడు–3, నూజివీడు మండలం కుక్కలగూడెం, పోలసానపల్లి–2, పట్టణంలోని ఆర్ఆర్‌పేట–1, నందనవనం సెంటర్లకు అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అకాల వర్షంతో మామిడి రైతులకు నష్టం

రెడ్డిగూడెం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, గురువారం కురిసిన భారీ వర్షంతో మామిడి చెట్లు నేలకు వరగడంతో పాటు మామిడి కాయలు నేలరాలాయి. దీంతో మామిడి రైతులకు అపార నష్టం వాటిల్లింది. మండలంలో అత్యాధికంగా 20 వేల ఎకరాల్లో సాగవుతున్న మామిడి ఈ ఏడాది చీడపీడల ఉధృతికి పంట దిగుబడి తగ్గింది. చేతికి పంట అందివచ్చిన తరుణంలో వాతావరణంలో వస్తున్న మార్పులతో మామిడి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. అలాగే పొగాకు, మొక్కజొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుంది.

ఇంటర్ పరీక్షలకు 53 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సర జువాలజీ, గణితం 1బీ, హిస్టరీ పరీక్షకు గురువారం 53 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో కలిపి 1,427 మంది విద్యార్థులకు 1,374 మంది పరీక్షలకు హాజరు కాగా 53 మంది గైర్హాజరయ్యారు. ఆయా కళాశాలలకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా ఐ.గిరిదేవి, ఈదర కోటేశ్వరరావు, ఎస్.వెంకటలక్ష్మి, కె.సంధ్యాజ్యోతి వ్యవహరించారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

ఎ.కొండూరు: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈఓ రాజశేఖర్ ఆదేశించారు. మండలంలోని ఏ.కొండూరు ఎల్‌టీ తండాలో ఎలిమెంటరీ పాఠశాలను గురువారం వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. రాగి జావ విద్యార్థులందరికీ అందించాలని, నాణ్యతా ప్రమాణాలతో మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఉపాధ్యాయుల డైరీ లెసన్ ప్లాన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రమేష్, సీఆర్పీలు జి.నాగపండు, ఎం.పాపారావు పాల్గొన్నారు.

సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

చాట్రాయి: డ్రోన్ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో నిర్వహించిన డ్రోన్ సర్వేను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సర్వేని అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మందపాటి రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, నాయకులు విస్సంపల్లి సీతయ్య, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్వో వినోద్, పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd, ఇబ్రహీంపట్నం బ్రాంచ్ వారి [illegible] ... R.S.No. 209/1A ... డాక్యుమెంట్ నెం. 4774/2021 లోని 102 చ.గ. [illegible]

జగ్గయ్యపేట
తేదీ: 23-03-2023
రాయపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12620.
Enrolment No.: 1370/1987

ప్రకటన

[illegible]

తిరువూరు, తేదీ: 23.3.23
చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా
సెల్: 94407 84148

ప్రకటన

[illegible]

తిరువూరు, తేదీ: 23.3.23
చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా
సెల్: 94407 84148